క్లుప్తంగా

నెలనెలా పరీక్షలు చేసుకోవాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల: గర్భిణులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. ఆయన బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య వైద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరటి తోటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల: గ్రామాల్లో ప్రజలు పెరటి తోటలు సాగు చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రకృతి వ్యవసాయం శిక్షణ తరగతుల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖర్చు కూడా తక్కువ అవుతుందన్నారు. జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారులు ఫైజున్నీసా, ఏఓ సుధారాణి, ఏపీఎం హరి, సీసీ రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేణు, రెడ్డెమ్మ, కోమల, సుధారాణి, రూపకళ, సంఘమిత్రలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన



పలమనేరులో నిరసన తెలుపుతున్న నేతలు

పలమనేరు: సామాన్యునిపై భారం మోపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిలిండర్‌పై రూ.50 పెంచడం బాధాకరమని, దీనికి వ్యతిరేకంగా స్థానిక సీపీఎం నేతలు పట్టణంలోని టమాట మార్కెట్ ఎదురుగా బుధవారం నిరసన తెలిపారు. స్థానిక ఆపార్టీ పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్త, పట్టణ కమిటీ సభ్యులు రాజా, జయంతి, శ్రీరామయ్య, ధనమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

బీసీ సంఘ అధ్యక్షుడిగా ధనుంజయ



పుంగనూరు: నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడిగా ధనుంజయను ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ధనుంజయను ఎన్నుకున్నట్లు తెలిపారు. ధనుంజయ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నేతలు ప్రతిభ, గంగరాజు, చిట్టెమ్మ, సుబ్రమణ్యం, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కోరంలేక మండల మీట్ నేటికి వాయిదా

గంగవరం: కోరం లేనందున మండల సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా పడినట్టు ఎంపీడీఓ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఆమేరకు బుధవారం మండల మీట్ జరగాల్సి ఉండగా సభ్యులు ఎంపీడీఓ వైఖరిపై నిరసన వ్యక్తంచేస్తూ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎంపీడీఓ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్టు ఆపార్టీ నేతలు విమర్శిస్తున్నారు. దీంతో మండలంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. ఇలాంటి తరుణంలో మండల మీట్ వలన మండలానికి ఒరిగేదేమీ లేదనే మాట ప్రజాప్రతినిధుల్లో వినిపిస్తోంది. నేడు జరిగే మండలమీట్ అయినా సవ్యంగా సాగుతుందా లేదా మళ్లీ వాయిదా పడుతుందా అనే విషయం సందిగ్ధంగా మారింది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

గంగవరం: వేసవి కాలంలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందని ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గంగవరం సీఐ ప్రసాద్ సూచించారు. ఆయన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జనసంచారం తక్కువగా ఉన్న గృహాలు, ఒంటరి నివాసాల వద్ద చోరీలు జరిగిన నేపథ్యంలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: హైరిస్క్ గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 60 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలిచ్చారు. సీహెచ్‌ఓ పార్వతమ్మ, పీహెచ్‌ఎన్ కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

రాంగ్ రూట్ .. యమపురికే!



- యూటర్న్ తీసుకోకుండా వాహనాలకు ఎదురెళ్లుతున్న వైనం
- పగటిపూట ఇసుక ట్రాక్టర్లు, రాత్రుల్లో పాలవ్యాన్లు
- నాగమంగళం నుంచి క్యాటిల్ ఫామ్ వరకు సమస్య
- ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు, రవాణాశాఖ అధికారులు

పలమనేరు: రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని రవాణా, పోలీస్ శాఖలు ఎంత చెబుతున్నా వాహనదారులు మాత్రం అసలు పట్టించుకోవడం లేదు. పలమనేరు సమీపంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో వెళ్లేటప్పుడు నాగమంగళం నుంచి క్యాటిల్‌ఫాం దాకా వచ్చేటప్పుడు క్యాటిల్‌ఫామ్ నుంచి నాగమంగళం దాకా హైవేలో రానుపోనూ వేర్వేరు మార్గాలున్నాయి. నిబంధనల మేరకు వెళితే ఆలస్యమవుతుందని భావిస్తున్న వాహన డ్రైవర్లు హైవేలో వ్యతిరేక రూట్‌లో వచ్చి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.



రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలకు కారణమవుతున్న మిల్క్ చిల్లింగ్ యూనిట్

ఇలా వెళ్లాల్సి ఉండగా ఇలా వెళుతున్నారు..

నిబంధనల మేరకు పలమనేరు నుంచి బెంగళూరు, కుప్పం మార్గాల వైపు వెళ్లాల్సిన వాహనాలు నాగమంగళం ఫ్లై ఓవర్ ఎడమ వైపు నుంచి క్యాటిల్‌ఫాంకు వెళ్లాలి. అదే అటు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలు కుడివైపునున్న రహదారిలో రావాల్సి ఉంది. కానీ యూటర్న్ తీసుకొనేందుకు ఇష్టపడని డ్రైవర్లు రాంగ్‌రూట్‌లో నిత్యం ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

రాంగ్‌రూట్‌తో తప్పని ప్రమాదాలు..

ఈ మధ్య కాలంలో ఇక్కడ రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాల కారణంగా పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు మృతిచెందగా మరో 20మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు. హైవేలో రాంగ్‌రూట్‌లో వాహనాలు వస్తున్నా ఇదేమార్గంలో వెళ్లే హైవే పెట్రోలింగ్ వాహనం గానీ, ఆర్టీఓగానీ అసలు పట్టించుకోవడం లేదు. దీంతో మమ్మల్ని ఆపేవాడెవరా అంటూ పాలవ్యాన్, ట్రాక్టర్ల డ్రైవర్లు ఆడిందే ఆటగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని నిబంధనల మేరకు వాహనదారులు వాహనాలు నడిపేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పగలు ఇసుక ట్రాక్టర్లు, రాత్రుల్లో పాలవ్యాన్లు

క్యాటిల్‌ఫామ్ సమీపంలోని కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుకను తోడి పట్టణంలోకి తరలించే ట్రాక్టర్లు నిత్యం పదుల సంఖ్యలో హైవేపై వెళుతుంటాయి. ఈ ట్రాక్టర్లు అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్లేటపుడు నాగమంగళం మీదుగా క్యాటిల్‌ఫామ్ బ్రిడ్జి కిందకెళ్లి యూటర్న్ తీసుకొని ఆపై నదిలోకి వెళ్లాలి. కానీ ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు సులభంగా ఉంటుందని వచ్చిన దారిలో వ్యతిరేక రూట్‌లో వెళుతున్నారు. ఇక రాత్రుల్లో నాగమంగళం సమీపంలోని ఓ ప్రైవేటు పాలడెయిరీకి పాలను తరలించే వాహనాలు క్యాటిల్‌ఫామ్ నుంచి కుడివైపుగా వచ్చి చరణ్ హోటల్ వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లాలి. కానీ మూడు కిలోమీటర్లు దూరం వెళ్లాలని పాల వాహనాలు క్యాటిల్‌ఫామ్ నుంచి వ్యతిరేక రూట్‌లో వచ్చి పాలను డెయిరీలో దింపి మళ్లీ రాంగ్‌రూట్‌లో వెళుతున్నాయి.



నాగమంగళం వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్, పాలవ్యాన్

• నేడు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి గురువారం సదుంలో పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

• 11న ఒంటిమిట్టకు ప్రత్యేక బస్సులు

పుంగనూరు: ఒంటిమిట్టలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఈనెల 11న స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపుతున్నామన్నారు. టికెట్ ధర రానుపోను పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.350గా నిర్ణయించామని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఆసక్తి గల ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

• 12న రథోత్సవం

పుంగనూరు: మండలంలోని మోదుగులపల్లె, పెద్దచెరువు, బడిగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ప్రసన్న ఆంజనేయస్వామి రథోత్సవం ఈనెల 12న వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం గ్రామస్తులు మాట్లాడుతూ అదే రోజు రాత్రి బెంగళూరు గంగాధరం చే లవకుశ నాటకం, ఉట్ల తిరునాళ, కురవపల్లె వారిచే దేవరెద్దు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

• నేడు జాబ్‌మేళా రిజిస్ట్రేషన్

చౌడేపల్లె: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో గురువారం సిడాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సుబ్రమణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 30లోపు వయస్సు గల యువతీ యువకులు అర్హులన్నారు. పది పాసైన వారు,డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9676180056 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

• రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాలు

గుడుపల్లె: మండలంలోని ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం అంకురార్పణ, ధ్వజారోహణం, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న అశ్వవాహనపై దోపోత్సవం, 14న నంది వాహనంపై అమ్మవారు ఊరేగింపు, 15న గజవాహనం, 16న హంసవాహనం,17న శేషవాహనం, 18న పుష్ప పల్లకి, 19న అగ్ని గుండం, 20న వసంతోత్సవం, 21న అమ్మవారి దీపారాధన పొంగళ్లతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

వైభవంగా నవమి వేడుకలు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం అర్చకులు మూలవిరాట్‌లకు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉత్సవ మూర్తులను సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులిచ్చి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్తలు సూదంశెట్టి జానకిరాం, పట్టాభిరాం పర్యవేక్షించారు.



అలంకరణలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి

• వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

రొంపిచెర్ల: నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఆశీర్వదించారు. బుధవారం రాత్రి నాగిరెడ్డి కల్యాణ మండపంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ దేవులపల్లె హరినాథరెడ్డి కుమారై జాహ్నవి, ఐరాల మండలం దిగువకామినాయునపల్లెకు చెందిన బాలకృష్ణారెడ్డి కుమారుడు శరశ్చంద్రసాయిరెడ్డి వివాహం జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే దంపతులు హాజరై ఆశీర్వదించారు

వధూవరులను ఆశీర్వదించిన పెద్దిరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): నూతన వధూవరులు కొత్తపేటకు చెందిన మండల కో–ఆప్షన్ సభ్యుడు సైపుల్లా కుమారుడు, కోడలిని బుధవారం కొత్తపేటలోని వారి స్వగృహంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. నేతలు విరూపాక్షి జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, నిరంజన్ రెడ్డి, జాఫర్ హుస్సేన్, మునిరత్నం, రాజమూర్తి, రామ్మూర్తి, పృథ్వీ పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యవంతంగా ఉంటారని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహతీ ఫౌండేషన్ వారి సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. వైద్యాధికారిణి శాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న వైద్యాధికారిణి శాలిని

ఎస్టీఓ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చండి

పలమనేరు: పట్టణంలో అద్దెభవనంలో సాగుతున్న ఎస్టీఓ కార్యాలయాన్ని అక్కడి రెండో అంతస్తులో పెట్టారని మెట్లమీదుగా పెన్షనర్లు వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉందని కనీసం గ్రౌండ్‌ఫ్లోర్‌లో కార్యాలయం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక పెన్షనర్ల సంఘ నాయకులు సోమచంద్రారెడ్డి ఎస్టీఓను కోరారు. ఆమేరకు కార్యాలయానికి కొత్త ఎస్టీఓగా బాధ్యతలు తీసుకున్న రామక్రిష్ణయ్యను ఆ సంఘం తరపున వారు ఘనంగా సన్మానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



ఎస్టీఓను సన్మానిస్తున్న నేతలు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పూతలపట్టు(కాణిపాకం): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించేలా చూడాలని రాష్ట్ర స్థాయి రైతు సాధికార సంస్థకు చెందిన చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం వార్షిక కార్యాచరణ, ప్రణాళికపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. దీనికి మండలంలోని వ్యవసాయ శాఖ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది హాజరయ్యారు. వారు వార్షిక ప్రణాళికలపై సిబ్బందికి వివరించారు.

ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి

పలమనేరు: ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టిని సారించి ఎప్పటికప్పుడు ఆయా శాఖలు గ్రీవెన్స్ పరిష్కారంపై చొరవ చూపాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. ఆమేరకు తన కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పట్టణంలో నూతన హంగులతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణంపై ఆయన డీఎం టీకే స్వామితో చర్చించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కృత్రిమ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొత్త బోర్లను ఏర్పాటు చేస్తాం

వి.కోట: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో పంచాయితీలోని చాలా గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడుతోందని, దానిని అరికట్టడానికి అవసరమైన గ్రామాల్లో నూతన బోర్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీరుస్తామని సర్పంచ్ పీఎస్. లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. ప్రజల అభ్యర్థన మేరకు పంచాయతీ నిధులను మంజూరు చేయించి బుధవారం నూతన బోరును వేయించారు. ఈ బోరుకు 5వ వార్డు మెంబర్ కుమార్‌రాజా చేతుల మీదుగా భూమిపూజ చేసి డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల మహిళాధ్యక్షురాలు శశికళ పాల్గొన్నారు.



బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న వార్డు మెంబర్

విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

పులిచెర్ల(కల్లూరు): సదుం మండలం కలకటవారిపల్లెలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తిరిగి విగ్రహాన్ని అక్కడే ఏర్పాటు చేయాలని మాల మహానాడు యువత అధ్యక్షుడు జట్టి దుర్గాప్రసాద్ కోరారు. ఆమేరకు బుధవారం పులిచెర్ల తహసీల్దార్ జయసింహకు వినతి పత్రం అందజేశారు. విగ్రహాన్ని తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణీకుమార్, నాయకులు బాలగంగాధర్, వినయ్‌కుమార్, శ్రీహరి, రెడ్డెప్ప, శ్రీకాంత్ పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

సన్మానం



తులసీనాథంనాయుడు దంపతులను సన్మానిస్తున్న ఉపకులపతి

పలమనేరు: పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు దంపతులను తిరుపతి సంస్కృత వర్సిటీ ఉపకులపతి ఆచార్య కృష్ణమూర్తి బుధవారం అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. తెలుగుభాషా ఔన్నత్యానికి ఆ దంపతులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

ఆక్రమణల తొలగింపు



షెడ్డును కూల్చివేసిన అధికారులు

బైరెడ్డిపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డును రెవెన్యూ అధికారులు, పోలీసులు బుధవారం తొలగించారు. బైరెడ్డిపల్లెకు చెందిన శేషిగాడు గత కొంతకాలంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నాడు. ఇటుక బట్టీలకు కాపలా మనిషి ఉండేందుకు ఓ షెడ్డును ప్రభుత్వ స్థలంలో నిర్మించాడు. దీంతో అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించారు.

ఎంపీడీఓ వైఖరిపై సభ్యుల ధ్వజం

- నిబంధనలకు విరుద్ధంగా పనులపై ఆగ్రహం
- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్
- సమాధానం చెప్పని ఎంపీడీఓ
- మండలమీట్ వాయిదా

పలమనేరు: స్థానిక ఎంపీడీఓ వైఖరి కూటమికి అనుకూలంగా ఉండడంతో మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు ఆయన వైఖరిపై ధ్వజమెత్తారు. ఇలా ఏకపక్షంగా అధికారులు వ్యవహరించడం సబబేనా అని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీఓ దాటవేత సమాధానాలు ఇచ్చి మౌనంగా ఉండిపోయారు. స్థానిక ఎంపీపీ రోజా అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అజెండాకు ముందుగానే సభ్యులు గతంలో ఎంపీపీ తీర్మానించిన రూ.30లక్షలకు పైగా పనులను తమకు తెలియకుండా బైపాస్ చేసి అధికారుల ద్వారా పనులు చేపట్టేలా కూటమి నేతలకు మేలు చేసే పనులను అడ్డగోలుగా ఎందుకు చేపట్టారని ఎంపీడీఓ ఖాదర్‌బాషాను నిలదీశారు. దీంతో ఆయన ఆ సమావేశంలో తనకు తెలీదని సమాధానం ఇచ్చారు. దీనిపై సభ్యులు ఆయన తీరుపై మండిపడ్డారు. అనంతరం మండల సర్పంచుల సంఘ నేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మండల సమావేశం ఆమోదించిన పనులను చేపట్టలేదనే తాము జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అక్కడ న్యాయం జరగలేదని హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆదేశాలను సైతం ఎంపీడీఓగా ఎందుకు ఖాతర్ చేయలేదని ప్రశ్నించారు. దీనికి మౌనమే సమాధానమైంది. దీంతో సభ్యులంతా కలిసి మళ్లీ మండల మీట్‌ను వాయిదా వేసినట్టు తీర్మానం చేశారు. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై జెడ్పీ అధికారులు విచారణ చేసి ఎంపీడీఓపై చర్యలు తీసుకున్నాకే మండల మీట్ జరుగుతుందని ఈసందర్భంగా హెచ్చరించారు. ఆపై కార్యాలయం ఎదుట కొంతసేపు నిరసన తెలిపారు. జెడ్పీటీసీ మల్లిక, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. ఎస్ఐ స్వర్ణతేజ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ, ప్రజాప్రతినిధుల నిరసన